# టీవీ న్యూసెన్స్



(ఆదివారం ! అది టీవీ హాల్ ! ఇంటి యజమాని గోపాల్... దినపత్రిక  చదువుతూ వుంటాడు. పెద్ద కొడుకు వికాస్ పరీక్ష కోసం పుస్తకాల్తో కుస్తీ పడ్తూ ఉంటాడు. చిన్న కొడుకు రవి హోం వర్క్ చేస్తూఉంటాడు ! ఇంటి యజమానురాలు కమల ఎక్కడో వంటింట్లో వంట చేస్తూ వుంటుంది.)

గోపాల్ : కమలా ! ఎక్కడున్నావ్ ? ఇలారా ! నీ కిష్టమైన బాలచందర్ సినిమా రిలీజైంది ! ఈ రోజు ఆదివారం కదా ! ఫస్ట్‌షోకి వెళ్దామా ?

కమల : అయ్యో ! ఈ రోజు పిక్చర్ కోసం బయటకు ఎందుకండీ ! ఈరోజు టీవీలో అసలే సావిత్రి పిక్చర్ వుంది ! బాలచందర్ పిక్చర్ ఈ రోజే కదా రిలీజైంది. కావాలంటే రేపు వెళ్ళొచ్చు ! నేను మాత్రం ఈ రోజు బయటికి ఎక్కడికీ రాను బాబూ !

గోపాల్ : ఎంచక్కా పెళ్ళాం పిల్లల్తో వేడి వేడి పకోడీలు తింటూ - సరదాగా ఇంట్లో సినిమాలు చూడొచ్చని టీవీ కొన్నాం ! కాని ప్చ్.... ఏం లాభం ? అటు టీవీ ఆన్ చేస్తామో లేదో - బిలబిలమంటూ - మన ఇరుగింటమ్మలూ - పొరిగింట

| | | |
|---|---|---|
| | | మ్మలూ - ఠంచన్‌గా (టకటక శబ్దం) అదిగో - నూరేళ్ళా యుష్షు.... మీ ఫ్రెండ్సంతా రానే వచ్చారు ! చూస్తావేం- వెళ్ళి తలుపులు తీయ్ ! |
| | | (కమల వెళ్ళి తలుపులు తీసి - నవ్వు తెచ్చి పెట్టుకుంటూ) |
| కమల | : | రండి ! రండి ! |
| సూర్యకాంతమ్మ | : | (ప్రవేశిస్తూ) నమస్కారం అన్నయ్య గారూ ! |
| గోపాల్ | : | (నీరసంగా) నమస్కారం.... రండి కూర్చోండి ! |
| | | (సూర్యకాంతమ్మ వెనకాల మాణిక్యాలూ, ఆవిడ వెనకాల ఆండాళమ్మా ఆ వెనుక - పిల్లా పితుకూ మరో ఐదుగురు వస్తారు ! టీవీ హాల్లోవున్న కుర్చీలు సరిపోక - చేసేదిలేక గోపాల్, అతడి పెద్ద కొడుకు - టీవీ హాల్ పక్కనేవున్న బెడ్‌రూంలోకి వెళ్ళిపోతారు.) |
| | | (నోట్: బెడ్‌రూంకూడా ప్రేక్షకులకి కన్పించేట్టూ- మధ్యలో పార్టీషన్ చేసి - ఒకవైపు టీవీహాల్, మరోవైపు బెడ్‌రూం కన్పించేట్టూ చేయాలి) |
| సూర్యకాంతమ్మ- మనవడు | : | బామ్మా, దాహంగా వుందే! కాస్త నీళ్ళివ్వమని చెప్పవే? |
| సూర్యకాంతమ్మ | : | నాయనా గోపీ ! వీడికి నీళ్ళట ! నీకు పుణ్యముంటుంది ! కాస్త నీళ్ళు తెచ్చిస్తావా బాబూ ? |
| | | (గోపీ వంటింట్లోకి వెళ్ళి నీళ్ళగ్లాసుతో తిరిగివచ్చి - సూర్యకాంతమ్మ మనవడికి ఇస్తాడు. ఇంతలో పొరుగింటి జగదాంబ వస్తుంది. ఏ కుర్చీ ఖాళీగా లేకపోవడంతో ఇంటి యజమానురాలు కమల లేచి తన సీట్ ఆఫర్‌చేసి - ఆ పిక్చర్‌మీద అభిమానం చాలక గోపీతోపాటు నించునే పిక్చర్ చూస్తూ ఉంటుంది) |
| ఆండాళమ్మ | : | ఇదేమిటీ - నా కాళ్ళకు చల్లగా తగుల్తోంది ! అయ్యో ఏమండీ మాణిక్యాంబగారూ మీ కొడుకు మూత్రం పోసినట్టున్నాడు. |
| మాణిక్యాంబ | : | (కోపంతో) ఏమండీ - ఒక గుడ్డ ఉంటే ఇస్తారూ ? ఈ వెధవ నేల తడిపేశాడు ! |
| కమల | : | ఒరేయ్ రవీ - ఏదైనా ఒక గుడ్డ పట్రా ! |
| | | (రవి లోపలినుండి గుడ్డ ఒకటి తీసుకొస్తాడు... మాణిక్యాంబ దాన్ని తీసుకుని నేల తుడుస్తూ ఉంటుంది. ఇంతలో బెడ్ రూంలో కూర్చున్న గోపాల్ లోపల్నుండి 'రవీ' అని పిలుస్తాడు. రవి బెడ్‌రూం లోకి వెళ్తాడు.) |

గోపాల్ : ఏదీ నీ ప్రోగ్రెస్ కార్డు ? (రవి వెళ్ళి తీసుకొస్తాడు - గోపాల్ దాన్ని చూస్తూ:) లెక్కలూ - సైన్స్ సున్నా! సోషల్ - ఇరవై మార్కులు ! రోజూ నీకూ మీ అమ్మకీ టీవి చూట్టంతోనే సరిపోతుంది! ఇక చదవడానికి టైమెక్కడ ?

(ఇంతలో టీవీ హాల్లో ఆండాళమ్మ పిల్లాడు - నిక్కర్ కిందకు లాక్కుంటూ - వాళ్ళమ్మ చెవిలో ఏదో మెల్లిగా చెప్తాడు. ఆమె కమలని చూస్తూ)

ఆండాళమ్మ : వీడికి పొద్దట్నుంచీ లూజ్ మోషన్స్ ! కాస్త టాయిలెట్ చూపిస్తారా ?

కమల : రా బాబూ ! ఏరా రవీ ! ఇదిగో ఈ బాబుకి టాయిలెట్ చూపించరా !

(టీవీ చూట్టానికి వచ్చిన పిల్లకాయలంతా - తమతో తెచ్చుకున్న వేరు శనక్కాయల్ని తింటూ - దాని పొట్టంతా రూం నిండా చెల్లా చెదురుగా పడేస్తారు. టీవీలో నవ్వు వచ్చే అంశం వచ్చినప్పుడల్లా 'పే... ద్ద'...గా నవ్వడంతో - లోపల బెడ్‌రూంలో పరీక్షకి చదువుకుంటోన్న పెద్ద కొడుక్కి డిస్టర్బ్ అయి తలపట్టుకుంటాడు.)

గోపాల్ పెద్ద కొడుకు: ఏం టీవో ఏమిటో ! ఇది ఇల్లుకాదు ! సినిమా హాల్ అయిపోయింది.

రవి : అవున్రా అన్నయ్యా ! డాడీకి తెలీకుండా టిక్కెట్లు పెడ్దామా ? టీవీలో సినిమా ఉన్న రోజు ఎంచక్కా ఎంత లేదన్నా పాతిక రూపాయలు వసూలు అవుతాయి !

గోపాల్ పెద్ద కొడుకు :నోర్ముయ్ ! వెధవ జోకులూ నువ్వూ !

(ఇంతలో ఇంటి యజమానురాలి అన్నయ్య రంగనాథ్ వస్తాడు. వాళ్ళు టీవీ చూస్తూ ఇంట్లోకి ఎవరొచ్చిందీ పట్టించుకోరు! తలుపు కొట్టిన శబ్దం విని కమల విసుక్కుంటూ - టీవీ చూస్తూనే వెళ్ళి తలుపు తీసి- టీవీ చూస్తూనే మళ్ళీ యధాస్థానానికి వస్తుంది! ఆమె ఇంట్లోకి ఎవరు వచ్చిందీ గమనించదు! ఇంతలో టీవీ చూట్టానికి వచ్చిన వాళ్లలో ఒక చిన్న పిల్లాడు ఏడుస్తూ ఉంటాడు. ఆ పిల్లవాడి అమ్మ - కమలతో)

పిల్లవాడి అమ్మ : ఏమండీ - ఏమైనా బిస్కెట్లు ఉంటే ఓ రెండు ఇస్తారా ? వీడు గుక్కపెట్టి ఒకటే ఏడుస్తున్నాడు ! ఇంటికి వెళ్ళి తీసు కొద్దామంటే సస్పెన్సంతా ఇప్పుడు ఈ సీన్లోనేవుంది!

(కమల ఇంట్లోకి వెళ్ళి బిస్కట్ పాకెట్ తెస్తూ లోపలి కుర్చీలో కూర్చున్న వాళ్ళ అన్నయ్యను చూసి)

కమల : (సంతోషంతో) అరే అన్నయ్యా ! ఎప్పుడొచ్చావురా ?

రంగనాథ్ : గంటయ్యింది ! టీవీ చూసుకుంటూ వచ్చి - నువ్వే తలుపు తీశావ్ ! ఎవరొచ్చిందీ చూడకుండానే వెళ్ళి - మళ్ళీ టీవీ చూస్తూ నించున్నావ్ ! నిన్నెందుకు డిస్టర్బ్ చేయాలని పలుకరించలేదు.

కమల : ప్రతి ఐదు నిముషాలకీ ఎవరో ఒకరొచ్చి తలుపు కొడ్తూనే ఉంటారు! ఎవరో పక్కింటి వాళ్ళే కాబోలనుకున్నాను! సారీ అన్నయ్యా!

(ఇంతలో ధబేలున శబ్దం విన్పిస్తుంది ! మాణిక్యాలు చిన్న కొడుకు వెళ్ళి - టీవీ మీద పెట్టిన ఫ్లవర్ వాజ్ తీసుకుని దాంతో ఆడుకుంటూ ఢామ్మని పగులగొడ్తాడు! మాణిక్యాంబ వాణ్ణి రెండంటిస్తుంది. వాడు ఆరున్నొక్కరాగం అందు కుంటాడు. ఆ గలాభాకి అక్కడికి చేరుకున్న కమల తనకిష్టమైన ఫ్లవర్ వాజ్ పగలి పోవడం చూసి ఎవర్నీ ఏమీ అన్లేక - చేసేదేమీ లేక - చీపురు పెట్టి ఆ గాజు ముక్కలన్నీ ఊడ్చేస్తుంది)

రంగనాథ్ : (పిలుస్తూ) కమలా !

కమల : ఏంటన్నయ్యా (అంటూ బెడ్ రూంలోకి వస్తుంది)

రంగనాథ్ : ఇదంతా ఏమిటి కమలా ! ఇల్లంతా ఎలా ఉందో చూశావా? ఎంత చక్కగా సర్దుకునేదానివీ - ఇప్పుడేమైంది నీకు ? ఇల్లంతా ఛండాలంగా - ఎక్కడి వస్తువులు అక్కడ - ఏదో యుద్ధ భూమిలా...

కమల : ఏం చేయనన్నయ్యా ? రోజూ వాళ్ళందరూ వెళ్ళగానే శుభ్రంగా ఊడ్చేసి నీళ్లతో నేలంతా తుడుచుకుంటాను ! మళ్ళీ మామూలే! టీవీ చూడ్డానికి రావొద్దని చెప్పడానికి మొహ మాటం అడ్డొస్తోంది.

రంగనాథ్ : నువ్వు పర్మిషన్ ఇచ్చావంటే చాలు ! వీళ్ళందర్నీ ఉన్న ఫలాన ఇప్పుడు నిముషంలో ఇంట్లోంచి పంపించేస్తాను!

కమల : ఎలా ?

రంగనాథ్ : నువ్వు నేను చెప్పినట్టు చేయాలి మరి!

కమల : సరే!

(రంగనాథ్ బెడ్ రూం నుండి టీవీహాల్ తలుపు దగ్గరికి వచ్చి

టీవీ చూస్తోన్న వాళ్ళకి విన్పించేట్టుగా)

రంగనాథ్ : కమలా ! సినిమాకి అవతల టైమవుతోంది ! పిల్లల్తో త్వరగా రెడీకా ! అసలే ఆ పిక్చర్ ఈ రోజే రిలీజైంది! టికెట్లు దొరికే నమ్మకం లేదు ! బావా, మీరు కూడా !

కమల : వస్తున్నాం అన్నయ్యా !

రంగనాథ్ : (టీవీ హాల్లోకి వచ్చి) రెడీ అయ్యారా ? తాళం ఎక్కడుందో తీసుకుని త్వరగా రండి బయటికి! టైమైపోతోంది!

(వాళ్ళంతా తాళం, తాళం చెవి గుత్తి, టార్చ్‌లైట్‌తో టీవీ హాల్లోకి వస్తారు - ఇక వెళ్దామన్నట్లుగా. కానీ టీవీ చూస్తోన్నవాళ్ళు ఎవరూ ఎంతకీ కదలరు)

రంగనాథ్ : (నీళ్ళు నమిలి) మేం పిక్చర్‌కి వెళ్తున్నాం !

సూర్యకాంతమ్మ : ఆ... ఆ... అర్థమైంది అన్నయ్యగారూ ! మీరు పిక్చర్‌కి కదా వెళ్లేది ! తప్పకుండా వెళ్ళండి ! కానీ సావిత్రి పిక్చర్ సగంలో వదిలి మేం ఎలా వెళ్లేది మీరే చెప్పండి ? మీకభ్యంతరం లేకపోతే- ఆ తాళం కప్పా, తాళం చెవీ ఇలా ఇవ్వండి ! టీవీ చూశాక మేమే తాళంవేసి, మీరు వచ్చాక మీకు తాళం చెవి జాగ్రత్తగా అప్పగిస్తాం, సరేనా ?

(ఇంటివాళ్ళంతా తెల్లబోయి - మరో రెండు నిముషాలకి తేరుకొంటారు. రంగనాథ్ మింగలేకా కక్కలేకా - చేసేదేం లేకా - సూర్యకాంతమ్మకి తాళం చెవీ, తాళం కప్పా - నీరసంగా అప్పగిస్తూ ఉండగా - తెర)

**ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక - తేదీ: 3-1-1991**

**అంకితం**



**శ్రీమతి ఎ. విజయ భారతి**
M.A.,B.Ed.
**హైదరాబాదు.**

**ఆ**మె గొప్ప క్రిటిక్ ! చక్కటి వక్త ! ఐడియల్ టీచర్! బెస్ట్ డ్యాన్స్ డైరెక్టర్ ! అన్నింటికీ మించి... **మంచి ప్రయోక్త!**

ఆమె మాటతీరూ, అడ్మినిస్ట్రేషన్ - ఆమె సబార్డినేట్స్‌కి గొప్ప ఇన్స్‌పిరేషన్!

అందర్తో -ఫ్రెండ్లీగా - సరదాగా - ఆడుతూ పాడుతూ పనిచేసే ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ ట్రెజరర్... **శ్రీమతి ఎ. విజయ భారతి** కి...

ప్రేమతో....

1-11-2005